జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 97 19-4-2026 వెల: రూ.2/- పేజీలు: 06




# మహిళా బిల్లును అడ్డుకోవడం భ్రూణహత్యే

- విపక్షాలపై ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం
- నిన్న లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు
- మహిళా రిజర్వేషన్లకు చుక్కెదురు నేడు జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ
- ఈ పాపంలో కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎస్పీ ప్రధాన దోషులని తీవ్ర విమర్శ
- దేశానికి మేలు చేసే ప్రతి సంస్కరణను కాంగ్రెస్ అడ్డుకుంటుందని ఆరోపణ
- సంఖ్యాబలం తక్కువగా ఉన్నా మహిళా రిజర్వేషన్ కోసం పోరాటం ఆపబోమని స్పష్టీకరణ
- విపక్షాలకు మహిళలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్య



భారత రాజకీయాల్లో మహిళలకు చారిత్రక సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీ శక్తి వందన్' సవరణను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు "గర్భంలోనే చంపేశాయని" ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లోక్‌సభలో ఈ బిల్లు వీగిపోవడంపై శనివారం సాయంత్రం జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఇది కేవలం బిల్లు ఓటమి కాదని, భారత మహిళల ఆకాంక్షలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఈ చారిత్రక తప్పిదంలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే పక్షాలదే ప్రధాన పాపమని నేరుగా ఆరోపించారు.

- మిగతా 2వ పేజీలో

### నీచ రాజకీయాల కోసం కాంగ్రెస్, డీఎంకే రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నాయి

- మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్న మోదీ
- దురదృష్టవశాత్తు ఫలితం లేకుండా పోయిందని వ్యాఖ్య
- సాధారణ కుటుంబాల సోదరీమణులు పార్లమెంటుకు రావాలని కోరుకున్నానని వ్యాఖ్య

2లో

## ఇరాన్ మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయలేదు

- హర్మూజ్‌ను మూసివేయడం ద్వారా ఇరాన్ తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోందన్న ట్రంప్
- టెహ్రాన్ దశాబ్దాలుగా ఇలాగే వ్యవహరిస్తోందన్న ట్రంప్
- ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయన్న ట్రంప్



2లో




## తెలంగాణలో మండుతున్న ఎండలు..

- కొమురంభీమ్ జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఉదయం నుంచే బయటకు రాలేని పరిస్థితులు
- నిజామాబాద్ జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచన

2లో

## ముసుగు రాజకీయాలు వద్దు..

### మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయండి

- మహిళా రిజర్వేషన్లపై కేంద్రంపై రేవంత్ రెడ్డి విమర్శలు
- బిల్లు వీగిపోవడం చిత్తశుద్ధి లోపమా?
- డిలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం?
- తక్షణ అమలు కోసం కాంగ్రెస్ సవాల్



మహిళా రిజర్వేషన్ల అంశంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రంగా తూర్పారబట్టారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల బిల్లు

- మిగతా 2వ పేజీలో



## ఇక్కడ ఉన్నది 1995 సీఎం

- గొడ్డలి పార్టీ ఆగడాలు సాగనివ్వను: సీఎం చంద్రబాబు
- మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందన్న సీఎం
- 33% రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాడతామని స్పష్టీకరణ
- గొడ్డలి పార్టీకి కూల్చడం, నరకడమే తెలుసని విమర్శ
- జూన్ నాటికి పట్టణాల్లో 100 శాతం చెత్త తొలగింపు లక్ష్యం
- నిడదవోలు నియోజకవర్గానికి పలు అభివృద్ధి హామీలు

రాష్ట్రంలో గొడ్డలి పార్టీ ఆగడాలను ఎంతమాత్రం సహించేది లేదని, ఇక్కడ ఉన్నది 1995 నాటి ముఖ్యమంత్రి అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గొడ్డలి పార్టీకి తెలిసిందల్లా విధ్వంసం, కూల్చడం, నరకడమేనని, వారి ఆటలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా

- మిగతా 2వ పేజీలో



## జర్నలిస్టులు ఉగ్రవాదులా?


- టీడీపీ ప్రభుత్వం జర్నలిస్టులపై కక్ష సాధిస్తోందని జగన్ ఆరోపణ
- ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెడుతున్నారని తీవ్ర విమర్శ
- జర్నలిస్టులు పూడి శ్రీహరి, కేవీఆర్‌పై కేసులను ప్రస్తావించిన జగన్
- ఇది రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమంటూ చంద్రబాబుపై ధ్వజం
- చంద్రబాబు రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని జగన్ వ్యాఖ్య

2లో

## రూ.16 కోట్ల ఇంజెక్షన్ తో పునర్జన్మ...

- చిన్నారి పునర్విక ప్రాణాలు కాపాడిన మంత్రి నారా లోకేష్
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక
- రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఒక్కటే మార్గం
- ప్రజల సాయంతో రూ.10 కోట్లు, మిగిలిన మొత్తానికి లోకేష్ హామీ
- ఇంజెక్షన్‌ను విదేశాల నుంచి తెప్పించిన మంత్రి
- లోకేష్ సమక్షంలో చిన్నారికి జీన్ థెరపీ ఇంజెక్షన్ ఇచ్చిన వైద్యులు
- ప్రాణం నిలిపిన లోకేష్‌కు, దాతలకు కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

లక్షల హృదయాల ప్రార్థనలు ఓవైపు, మంత్రి నారా లోకేశ్ కృషి మరోవైపు... అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక ప్రాణాన్ని నిలబెట్టాయి. కొన్ని నెలలుగా 'సేవ్ పునర్విక' అంటూ సామాజిక మాధ్యమాల్లో సాగిన మానవతా ఉద్యమానికి సార్థకత లభించింది. ఆ పసిమొగ్గకు ప్రాణం నిలిచింది. అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (స్మా టైప్-1) వ్యాధితో ప్రాణాలతో పోరాడుతున్న ఏడాది చిన్నారి పునర్వికకు మంత్రి నారా లోకేష్ రూపంలో అందిన ఆపన్నహస్తం, పునర్జన్మను ప్రసాదించింది.





## కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇవ్వకుంటే మనమే ఆక్రమించుకుందాం: కవిత పిలుపు

- ఉద్యమకారులకు ఇస్తామన్న హామీలు నెరవేర్చాలని కవిత డిమాండ్
- లేదంటే కాంగ్రెస్ నాయకులు బయట తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరిక
- అసెంబ్లీలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీల ఊసే ఎత్తలేదని ఆగ్రహం

2లో

# మహిళా బిల్లును అడ్డుకోవడం భ్రూణహత్యే

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈ పరిణామం తనను తీవ్రంగా బాధించిందని, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం భ్రూణహత్యతో సమానమని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ సవరణ ఎవరి హక్కులనూ హరించడానికి కాదు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలకు దశాబ్దాలుగా నిరాకరించిన హక్కులను అందించడానికే. మేం నిజాయతీతో, స్పష్టమైన ఉద్దేశంతో చేసిన ఈ పవిత్ర మహాయజ్ఞాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి" అని మోదీ అన్నారు. 21వ శతాబ్దంలో భారత మహిళలకు కొత్త అవకాశాలు కల్పించి, వారి పురోగతికి అడ్డంకులను తొలగించేందుకే ఈ చట్టాన్ని తీసుకొచ్చామని వివరించారు. దేశాభివృద్ధిలో మహిళలను నిజమైన భాగస్వాములుగా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు మహిళా రిజర్వేషన్లపై మొదటి నుంచి వ్యతిరేకతే ఉందని, గతంలో జరిగిన ప్రయత్నాలను కూడా ఆ పార్టీ అడ్డుకున్న చరిత్రను ప్రధాని గుర్తుచేశారు. "ఈసారి కూడా తప్పుడు వాదనలు, పక్కదారి పట్టించే ఎత్తుగడలతో చట్టాన్ని అడ్డుకున్నారు. ఈ చర్యలతో ఆ పార్టీలు భారత మహిళల ముందు తమ నిజ స్వరూపాన్ని బయటపెట్టుకున్నాయి. దశాబ్దాల నాటి తప్పులను సరిదిద్దుకునేందుకు వచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ జారవిడుచుకుంది" అని విమర్శించారు. కుటుంబ పార్టీలైన కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీలు మహిళలు రాజకీయంగా ఎదగడాన్ని సహించలేవని ఆరోపించారు. సంస్కరణలను వ్యతిరేకించడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని మోదీ విమర్శించారు. "జన్ ధన్, జీఎస్టీ, డిజిటల్ చెల్లింపులు వంటి కీలక సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించింది. సైనికుల కోసం తెచ్చిన 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్'ను 40 ఏళ్ల పాటు అడ్డుకున్న చరిత్ర వారిది. ఉగ్రవాదం, నక్సలిజంపై ఆ పార్టీ వైఖరిని దేశం మర్చిపోదు" అని మోదీ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్నజీవి అని, ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి బతుకుతోంది అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. డీలిమిటేషన్ అంశంపై కూడా విపక్షాలు అసత్య ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించాయని మండిపడ్డారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, పైగా అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరుగుతుందని తాను హామీ ఇచ్చినా వినలేదన్నారు. "ఈ బిల్లును అడ్డుకోవద్దని, కావాలంటే ఈ ఘనతను మీరే తీసుకోండని విపక్ష నేతలకు విజ్ఞప్తి చేసినా వారు పెడచెవిన పెట్టారు. ఇవాళ మాకు సంఖ్యాబలం తక్కువగా ఉండొచ్చు. కానీ మహిళా రిజర్వేషన్ సాధన కోసం మా పోరాటం ఆగదు. చట్టసభల్లోకి రావాలన్న మహిళల కలలను ధ్వంసం చేసిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు రాబోయే ఎన్నికల్లో దేశ మహిళలు గట్టిగా బుద్ధి చెబుతారు. వారు ఇప్పటికైనా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి" అని మోదీ హెచ్చరించారు. ఈ బిల్లును అడ్డుకున్న పాపం ఆ పార్టీలను జీవితాంతం వెంటాడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

## నీచ రాజకీయాల కోసం కాంగ్రెస్, డీఎంకే రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నాయి

కాంగ్రెస్, డీఎంకే, వాటి మిత్ర పక్షాలు నీచ రాజకీయాల కోసం మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్ సభలో అడ్డుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల కోసం ఎన్డీయే ప్రభుత్వం ఎంతో కృషి చేసినప్పటికీ దురదృష్టవశాత్తూ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోయంబత్తూరులో నిర్వహించిన ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ ద్వారా తమిళనాడు రాష్ట్రానికి మరిన్ని లోక్ సభ స్థానాలు రావాల్సి ఉండగా, డీఎంకే దానిని అడ్డుకుందని మండిపడ్డారు. తమిళనాడుకు మరిన్ని సీట్లు రావాలని డీఎంకే కోరుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. సాధారణ కుటుంబాల సోదరీమణులూ పార్లమెంటుకు రావాలని తాను కోరుకున్నానని అన్నారు. మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చినప్పటికీ, ఆ క్రెడిట్‌ను ప్రతిపక్షాలే తీసుకోవాలని కూడా తాను సూచించానని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు.

# ముసుగు రాజకీయాలు వద్దు..


(మొదటి పేజీ తరువాయి)

వీగిపోవడం చట్టాల ఓటమి కాదని, అది మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధికి జరిగిన ఓటమి అని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో సీట్ల పెంపు (డిలిమిటేషన్), రిజర్వేషన్ల రద్దు వంటి ప్రయత్నాలను ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా అడ్డుకున్నాయని, ఇది బీజేపీ అహంకారానికి పట్టిన చెంపపెట్టు అని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లోనే ప్రజలు బీజేపీ కుట్రలను ఓడించారని, ఇప్పుడైనా పంతాలకు పోకుండా మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అడ్డంకి కాదని, తాము బిల్లుకు వ్యతిరేకం కాదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "ఒక గంటలో చట్టాన్ని సవరిస్తామని అమిత్ షా గతంలో చెప్పారు కదా.. ఇప్పుడు మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాన్ని తీసుకురండి, ఆ బిల్లు పాస్ అయ్యేలా కాంగ్రెస్ పార్టీ లీడ్ తీసుకుంటుంది" అని ఆయన సవాల్ విసిరారు. 2027లో జరిగే యూపీ అసెంబ్లీ ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లలోనే మహిళలకు కేటాయింపులు చేసేలా ఎటువంటి రాజ్యాంగ సవరణలు చేసినా తమ మద్దతు ఉంటుందని, కానీ జనాభా ప్రాతిపదికన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేలా సీట్ల పెంపును ముడిపెడితే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేంద్రం ఇచ్చిన పిలుపు మేరకు జనాభా నియంత్రణను పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను అభినందించాల్సింది పోయి, సీట్ల సంఖ్య తగ్గించి శిక్ష వేయాలని చూడటం దుర్మార్గమన్నారు. సీట్ల పెంపు విధానంపై మోదీ ఎంచుకున్న పద్ధతికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల కోసం అవసరమైతే కొందరు మగవారి సీట్లను వదులుకోవాల్సి వస్తుందని, తన నియోజకవర్గం రిజర్వ్ అయినా తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఇదే క్రమంలో బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్ భజన రాజకీయాలు మాని రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేయాలని హితవు పలికారు. అలాగే, పార్లమెంట్ నిబంధనలపై అవగాహన లేకుండా మాట్లాడుతున్న తేజస్వి సూర్య వంటి నేతలకు కనీస జ్ఞానం కల్పించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇవ్వకుంటే మనమే ఆక్రమించుకుందాం: కవిత పిలుపు

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న భూమి ఇవ్వకపోతే మనమే ఆక్రమించుకుందామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జాగృతి ఇప్పటికే ఉద్యమకారుల తరఫున ఎన్నో పోరాటాలు చేసిందని, మున్ముందు ఉద్యమకారులతో కలిసి పనిచేస్తుందని అన్నారు. ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 'చలో సెక్రటరియేట్' పేరుతో సచివాలయ ముట్టడికి బయలుదేరగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు, ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేసి సమీప పోలీస్ స్టేషన్‌లకు తీసుకువెళ్లారు. మెహిదీపట్నం పోలీస్ స్టేషన్‌లో అరెస్టైన వారిని కవిత పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా ఉద్యమకారులను జైల్లో పెట్టడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకుంటోందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ నాయకులు బయట తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ఉద్యమకారులకు భూమి, పెన్షన్ హామీని అమలు చేయకుంటే జాగృతి ఆధ్వర్యంలో భూపోరాటాలు చేసి భూమి ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ముందున్నదే ఉద్యమకారులని కవిత తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని పాలించినప్పటికీ, ఉద్యమకారులకు దక్కాల్సిన గౌరవం దక్కలేదని విమర్శించారు. అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు పెన్షన్, భూమి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నరేళ్లు గడుస్తున్నా హామీ నెరవేర్చకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై తెలంగాణ జాగృతి ఒత్తిడి చేస్తే, ఉద్యమకారుల బిల్లు పెడతామని హామీ ఇచ్చారని, కానీ అసెంబ్లీలో ఆ ఊసే ఎత్తకుండా మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం ఉద్యమకారులు సచివాలయాన్ని ముట్టడించే పరిస్థితి రావడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యమకారులు ధైర్యంగా ఉండాలని, మనం కొట్లాడి తెచ్చుకున్నతెలంగాణలో హక్కులు సాధించుకోవడం కష్టమేమీ కాదని అన్నారు.

# ఇరాన్ మమ్మల్ని బ్లాక్‌మెయిల్ చేయలేదు



ఒకవైపు హార్మూజ్ జలసంధి, ఇరాన్ నౌకాశ్రయాలను అమెరికా దిగ్బంధించడం, మరోవైపు జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ప్రకటించడం మరోసారి ప్రపంచవ్యాప్తంగా చమురు ఆందోళనలకు కారణమైంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. హార్మూజ్ జలసంధిని మూసివేయడం ద్వారా ఇరాన్ తమపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోందని, కానీ ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదని అన్నారు. ఇరాన్ తమను బ్లాక్‌మెయిల్ చేయలేదని హెచ్చరించారు. "టెహ్రాన్ దశాబ్దాలుగా ఇలాగే వ్యవహరిస్తోంది. కానీ వారు మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేయలేరు" అని వైట్ హౌస్ లో విలేకరుల సమావేశంలో ట్రంప్ అన్నారు. ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఇరాన్‌తో సంప్రదింపులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈరోజు ముగిసే సమయానికి సంప్రదింపులకు సంబంధించి కొంత సమాచారం లభిస్తుందని వెల్లడించారు. హార్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ తొలుత ప్రకటించింది. ఇరవై నాలుగు గంటలు తిరగక ముందే తిరిగి మూసివేస్తున్నట్లు ప్రకటించింది. తమ ఓడరేవుల చుట్టూ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్నందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరాన్ తెలిపింది.

# రూ.16 కోట్ల ఇంజెక్షన్ తో పునర్జన్మ...

(మొదటి పేజీ తరువాయి)

మాటలతో చెప్పలేని ఆవేదన నుంచి ఆనందభాష్పాలు రాల్చే క్షణాలకు ఈ కథ నిలువుటద్దం. అన్నగా అండగా నిలుస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, రూ.16 కోట్ల విలువైన జీవన సంజీవనిని అందించి, ఆ చిట్టి చెల్లెలి చిరునవ్వును కాపాడారు లోకేష్. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో మంత్రి లోకేష్ సమక్షంలోనే వైద్యులు శనివారం ఉదయం ఆ ఇంజెక్షన్ ను పునర్వికకు అందించారు. ఈ ఘట్టంతో కొన్ని నెలలుగా సాగిన "సేవ్ పునర్విక" ఉద్యమం విజయవంతంగా ఫలించింది. కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన జంపాల మంగళ సురేష్ కుమార్, పుష్పావతి దంపతుల కుమార్తె పునర్విక. క్షవరం వృత్తి చేసుకుని జీవనం సాగించే సురేష్ కుమార్ కుటుంబానికి, తమ కుమార్తెకు ప్రాణాంతక వ్యాధి సోకిందని తెలియడంతో మిన్ను విరిగి మీద పడ్డట్టయింది. పుట్టిన ఆరు నెలలైనా చిన్నారిలో కదలికలు లేకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, హైదరాబాద్ రెయిన్‌బో ఆసుపత్రిని ఆశ్రయించారు. అక్కడ వైద్యులు పునర్వికకు స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ సోకినట్టు నిర్ధారించారు. ఈ వ్యాధికి అమెరికా నుంచి తెప్పించే రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఒక్కటే మార్గమని తేల్చిచెప్పారు. దీంతో కన్నీరుమున్నీరైన ఆ తల్లిదండ్రులు, తమ కుమార్తెను కాపాడుకోవడానికి దాతల సహాయం కోరుతూ ఈ ఏడాది జనవరిలో సోషల్ మీడియా వేదికగా అభ్యర్థించారు. "సేవ్ పునర్విక" పేరుతో సాగిన ఈ ప్రచారానికి లక్షలాది హృదయాలు స్పందించాయి. ఫిబ్రవరి నాటికి సుమారు రూ.10 కోట్ల విరాళాలు సమకూరాయి. అయినా, ఇంకా భారీ మొత్తంలో డబ్బు అవసరం కావడంతో, తల్లిదండ్రులు ఎక్స్ ద్వారా మంత్రి నారా లోకేష్‌ను సాయం కోరారు.

# తెలంగాణలో మండుతున్న ఎండలు..

తెలంగాణ రాష్ట్రంలో భానుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్ జిల్లాలోని మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలకు పైగా పెరిగాయి. గత సంవత్సరం ఇదే రోజున అత్యధిక ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు కాగా, ఈ సంవత్సరం నేడు 44.6 డిగ్రీలుగా నమోదైంది. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరింది.

# జర్నలిస్టులు ఉగ్రవాదులా?



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపైనా, కూటమి ప్రభుత్వంపైనా వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారని, ప్రత్యేకంగా జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే దేశద్రోహమా అని నిలదీశారు. ఇది జంగిల్ రాజ్ కాదా అని ఆయన ప్రశ్నించారు. సీనియర్ జర్నలిస్టులైన పూడి శ్రీహరి, కేవీఆర్‌లపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు జగన్ తెలిపారు. "బీసీ వర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పూడి శ్రీహరి చేసిన తప్పేంటి? అతనిపై అక్రమ కేసులు పెట్టి, ఇంట్లో సోదాలు చేయడానికి అతనేమైనా ఉగ్రవాదా? టెర్రరిస్టా?" అని జగన్ ప్రశ్నించారు. అదేవిధంగా, తెలంగాణకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కేవీఆర్ ఇంట్లో లేని సమయంలో ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమని ఆరోపించారు. పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇలాంటి అరాచకాలకు పాల్పడతారా అని నిలదీశారు. గడిచిన రెండేళ్లలో మహిళలు, బాలికలపై జరిగిన ఎన్నో దాడుల ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోని ప్రభుత్వం, తమను ప్రశ్నించిన వారిపై మాత్రం వెంటనే కేసులు పెడుతోందని జగన్ విమర్శించారు. "మీ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేసినా వారిపై చర్యలు తీసుకోలేదు. కానీ, వాస్తవాలు మాట్లాడితే మీకు ఎందుకు అంత ఉలుకు?" అని ప్రశ్నించారు. పౌరులకు రక్షణ కల్పించడంలో విఫలమై, స్వార్థ రాజకీయాల కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సుపరిపాలన అవుతుందా అని జగన్ అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని, ఈ చర్యలకు కచ్చితంగా మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. "మీరు చేస్తున్న దుర్మార్గాలకు దేవుడు, ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉంది" అని జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కక్ష సాధింపు చర్యలు, అక్రమ అరెస్టులు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# ఇక్కడ ఉన్నది 1995 సీఎం

(మొదటి పేజీ తరువాయి)

నిడదవోలులో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వం పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను కక్షపూరితంగా మూసివేసిందని, పేదలకు కడుపునిండా అన్నం పెట్టలేని ప్రభుత్వాలు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటేనని విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, కేంద్రంలో నరేంద్ర మోదీ ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని గట్టిగా హెచ్చరించారు.



### గొడ్డలి పార్టీ ఆగడాలు సాగనివ్వను

సుపరిపాలన అందించడమే తమ కూటమి లక్ష్యమని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం పోలవరం డయాఫ్రం వాల్‌ను గోదావరిలో కలిపేసిందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయని, తద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. అమరావతికి రాజధానిగా చట్టబద్ధత లభించిందని, గతంలో 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతులతో పాటు ఇప్పుడు మరో 10 గ్రామాల రైతులు కూడా భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చారని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 269 అన్న క్యాంటీన్లు తిరిగి పనిచేస్తున్నాయని, పేదల ఆకలి తీర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా మహిళలను మోసం చేస్తోందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రతిసారీ అడ్డుకోవడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. 1996లో దేవెగౌడ ప్రధానిగా ఉన్నప్పుడు, తాను యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉండగా బిల్లు పెడితే కాంగ్రెస్ సహకరించలేదని గుర్తుచేశారు. ఆ తర్వాత వాజ్‌పేయి హయాంలో నాలుగుసార్లు బిల్లు తెచ్చినా కాంగ్రెస్ అడ్డుపడిందని ఆరోపించారు. 2010లో యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకురాకుండా మహిళలకు ద్రోహం చేసిందన్నారు. ఇప్పుడు ప్రధాని మోదీ పట్టుదలతో బిల్లు తెస్తే, డీలిమిటేషన్ పేరుతో మళ్లీ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, వారి లాజిక్ ఏంటో అర్థం కావడం లేదన్నారు. మహిళలకు 33% రిజర్వేషన్లు అమలయ్యే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. మహిళల సామర్థ్యాన్ని గుర్తించి గౌరవించిన ఘనత తమ ప్రభుత్వాలదేనని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు, ఆస్తిలో సమాన హక్కు కల్పించారని గుర్తుచేశారు. తాను డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేశానని, నేడు డ్వాక్రా మహిళలు రూ. 50 వేల కోట్ల రుణాలు తీసుకునే స్థాయికి ఎదిగారని తెలిపారు.తమ ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలను సూపర్ హిట్ చేసిందని, ప్రతి నెలా 63 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలతో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు.



# ఐకేపీ కేంద్రాలతోనే మద్దతు ధర

- దళారులను నమ్మి మోసపోవద్దు
- ఉప్పలపహాడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- సర్పంచ్ చిన్నం బీరప్ప

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను మద్దతు ధరకు అమ్ముకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, దళారుల బారిన పడి మోసపోవద్దని ఉప్పలపహాడ్ సర్పంచి చిన్నం బీరప్ప సూచించారు. మండల పరిధిలోని ఉప్పలపహాడ్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల ప్రయోజనం కోసమే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, వీటిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఉప్పలపహాడ్‌తో పాటు పరిసర గ్రామలైన పారుపల్లి, మోదుబావి గూడెం, టీ.రేపాక రైతులు తమ ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవద్దని, నేరుగా ఐకేపీ కేంద్రాలకే తీసుకురావాలని కోరారు. ఏపీఎం నరసింహ మాట్లాడుతూ.. కేంద్రానికి వచ్చే ధాన్యంలో తేమ శాతం నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకోవాలని, తద్వారా త్వరగా తూకాలు పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీ.రేపాక సర్పంచి బండ శీను, పారుపల్లి సర్పంచి మాధవి శ్రీనివాస్, సీసీలు కొమురయ్య, వెంకటేశ్వర్లు, హరిబాబు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టళ్లకు 'ప్రగతి' కళ!

- 20 నుంచి 26 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- వంద శాతం రైతు రిజిస్ట్రీ పూర్తి చేయాలి
- అధికారులకు సీఎస్ రామకృష్ణారావు దిశానిర్దేశం
- జిల్లాలో 85 హాస్టళ్లలో పకడ్బందీ చర్యలు: అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వారం రోజుల పాటు 'సంక్షేమ వారాన్ని' సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో పారిశుద్ధ్య పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనపై రాజీ పడొద్దని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా క్విజ్, చిత్రలేఖనం, విద్యా విశ్లేషణ వంటి పోటీలు నిర్వహించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న లేదా చిన్నపాటి మరమ్మతులు అవసరమైన వసతి గృహాల్లో వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వసతులపై క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) తరగతులు, వేసవి శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి 'బడిబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి సంబంధించి 'రైతు రిజిస్ట్రీ' నమోదు ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

**కార్యాచరణకు సిద్ధంగా ఉన్నాం: అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సంక్షేమ వారాన్ని విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు వెల్లడించారు. జిల్లా పరిధిలోని 85 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు, వసతి గృహాల్లో కిచెన్ షెడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి జయమ్మ, డీఆర్‌డీవో నాగిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, బీసీ సంక్షేమాధికారి సాహితీ, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# మోదీ సర్కార్ తీరుపై కర్షకాగ్రహం!

- రైతుల సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెడతారా?
- అన్నదాతకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?
- 23 నుంచి కొత్తగూడెంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు
- రైతు సంఘం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ రెడ్డి



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** దేశానికి అన్నంపెట్టే రైతన్నల ఉసురు పోసుకుంటున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై తెలంగాణ రైతు సంఘం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. బహుళజాతి కంపెనీల లాభాల కోసం దేశ వ్యవసాయ రంగాన్ని, స్వావలంబనను అమెరికాకు తాకట్టు పెడుతున్నారని మండిపడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఎలుగెత్తేందుకు, భవిష్యత్ ఉద్యమాలకు పదును పెట్టేందుకు ఈ నెల 23, 24, 25 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే 3వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాసభల వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ప్రాణత్యాగాలతో సాగిన చారిత్రక ఉద్యమానికి తలొగ్గిన కేంద్రం, 2021 డిసెంబర్ 9న ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసానికి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు సీ2+50% మద్దతు ధర చట్టాన్ని ఎందుకు తీసుకురావడం లేదని నిలదీశారు. అమెరికాతో చేసుకున్న చీకటి వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని, కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విద్యుత్ సవరణ బిల్లు, విత్తన సవరణ చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ పేరుతో రాష్ట్రాల ఆదాయానికి గండికొడుతున్న కేంద్రం.. నిధుల్లో 60 శాతం రాష్ట్రాలకే ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పోడు రైతుల కష్టాలు, భూ నిర్వాసితుల కన్నీళ్లు తుడుస్తూ రైతు సంఘం నిరంతరం అండగా నిలుస్తోందని, అనేక పోరాటాలు చేసి హక్కులు సాధించిందని గుర్తుచేశారు. ఈ నెల 23న ప్రారంభమయ్యే రాష్ట్ర మహాసభలకు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారని తెలిపారు. మహాసభల సన్నాహకంగా ఏప్రిల్ 20, 21 తేదీల్లో పల్లెపల్లెనా బైక్ ర్యాలీలు నిర్వహించి, రైతు సంఘం జెండాలను ఎగరవేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల మల్లారెడ్డి, రాసమల్ల బలరాం, వేముల భిక్షం, జగిని శ్రావణ్, వేముల విజయ, సామ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా జనాభా గణన






- ఆన్‌లైన్‌లో పారదర్శకంగా వివరాల నమోదు
- సిబ్బందికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి
- ఆత్మకూరు(ఎం)లో ముగిసిన మొదటి దశ శిక్షణ తరగతులు

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** రాబోయే 2027 జనాభా గణన (సెన్సస్) ప్రక్రియను పకడ్బందీగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా గణనలో పాల్గొనే సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లకు ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మొదటి దశ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ లావణ్య లాంఛనంగా ప్రారంభించి, సిబ్బందికి పలు కీలక సూచనలు, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో జనాభా గణన అత్యంత కీలకమన్నారు. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికీ వెళ్లి, కుటుంబ సభ్యుల వివరాలను తప్పుల్లేకుండా సేకరించాలని ఆదేశించారు. సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని, కాబట్టి సాంకేతిక అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. "మా సిబ్బంది మీ ఇంటి వద్దకే వచ్చి వివరాలు అడుగుతారు.. సరైన సమాచారం ఇచ్చి ప్రతి ఒక్కరూ ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరించాలి" అని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. మాస్టర్ ట్రైనర్లు చిత్తరంజన్, రామచంద్రన్ తదితరులు సిబ్బందికి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ, ఫారాల గుర్తింపు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, ఎంఈవో మహదేవరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ షఫీయుద్దీన్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఎంఆర్ఐ) మల్లికార్జున్ రావు, ఎంపీఎస్‌వో సంతోష్‌లతో పాటు పలువురు ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.




## పకడ్బందీగా జనగణన.. ఎన్యుమరేటర్లకు దిశానిర్దేశం

- బీబీనగర్‌లో మొదటి దశ శిక్షణా తరగతులు ప్రారంభం
- పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- వివరాల నమోదులో తప్పులు దొర్లకుండా చూడాలని అధికారులకు సూచన

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/బీబీనగర్:** దేశాభివృద్ధికి, ప్రభుత్వ పథకాల రూపకల్పనకు అత్యంత కీలకమైన జనగణన (సెన్సస్) ప్రక్రియను యాదాద్రి భువనగిరి జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. ఇందులో భాగంగా శనివారం బీబీనగర్ మండల కేంద్రంలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మొదటి దశ శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణా ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లకోసారి జరిగే జనగణన కార్యక్రమంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర అత్యంత కీలకమన్నారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకూడదని, ప్రతి సమచారాన్ని కచ్చితత్వంతో నమోదు చేయాలని అధికారులకు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ తొలిదశ శిక్షణా శిబిరంలో సుమారు 50 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. జనగణన లక్ష్యాలను చేరుకోవడానికి, సిబ్బందికి సాంకేతిక, ఇతర అంశాలపై అవగాహన కల్పించడానికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని అధికారులు వివరించారు. ఈ శిక్షణా తరగతులు శనివారంతో పాటు సోమ, మంగళవారాల్లో కూడా కొనసాగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీబీనగర్ తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీఓ, ఎంఈఓలతో పాటు రెవెన్యూ, ఇతర శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## మత్తులో నడపొద్దు.. మృత్యువులో పడొద్దు!

- ఆత్మకూర్(ఎం)లో ముమ్మరంగా వాహనాల తనిఖీలు
- రాయగిరి - మోత్కూర్ రోడ్డుపై పోలీసుల స్పెషల్ డ్రైవ్
- రోడ్డు భద్రతపై ఎస్ఐ లక్ష్మీనారాయణ హెచ్చరిక

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) :** 'మద్యం సేవించి వాహనం నడపడం అంటే మృత్యుపాశాన్ని మెడకు వేసుకోవడమే' అని ఆత్మకూర్(ఎం) ఎస్ఐ ఎన్. లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని రాయగిరి-మోత్కూర్ ప్రధాన రహదారిపై శనివారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎన్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం కలగడమే కాకుండా, ఎదుటివారి ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టినట్లవుతుందని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తమ వెంట వాహన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, తనిఖీ సమయంలో అధికారులకు సహకరించాలని సూచించారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విద్యాసాగర్, రామకృష్ణ, లక్ష్మణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## జీతాలు రాక.. పారిశుధ్య కార్మికుల పస్తులు

- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- బొందుగుల గ్రామపంచాయతీ వద్ద నిరసన
- కలెక్టర్ స్పందించి ఆదుకోవాలని వేడుకోలు

**తొలివెలుగు రాజపేట:** పల్లెలను శుభ్రం చేసే పారిశుధ్య కార్మికుల బతుకులు అధ్వానంగా మారాయి. శ్రమను నమ్ముకున్న తమకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో ఆకలితో అలమటించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలోని బొందుగుల గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం కార్మికులు నిరసన చేపట్టారు. గత నాలుగు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని, దీనిపై కార్యదర్శిని ప్రశ్నిస్తే పొడిపొడి సమాధానాలు చెబుతూ దాటవేస్తున్నారని వారు ఆరోపించారు. గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు రాలేదని కార్మికులు వాపోయారు. రెక్కాడితే గానీ డొక్కాడని తమకు జీతాలు రాకపోవడంతో నిత్యావసరాలు కొనుగోలు చేయలేక, అప్పులు పుట్టక ఇబ్బందులు పడుతున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకుని, తమ పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెలా నిర్ణీత సమయంలో జీతాలు వచ్చేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

## పూజ చేస్తుండగా నిప్పంటుకుని.. రిటైర్డ్ ప్రిన్సిపాల్ మృతి

హైదరాబాద్‌లోని బేగంపేటలో విషాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున పూజ చేస్తూ దీపం వెలిగిస్తుండగా చీరకు నిప్పంటుకుని రిటైర్డ్ ప్రిన్సిపల్ విజయలక్ష్మీ (62) మరణించారు. వివరాల్లోకి వెళ్లే.. బేగంపేటలోని శ్యామ్‌లాల్ ప్రాంతానికి చెందిన విజయలక్ష్మీ ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. ప్రస్తుతం ఇంట్లో ఒంటరిగానే ఉంటుంది. రోజువారీ పూజల్లో భాగంగా తెల్లవారుజామున దీపం వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకుంది. దీంతో ఆమె భయంతో ఇంట్లో అటు ఇటు పరిగెత్తగా మంటలు మరింత వ్యాపించాయి. సోఫా, కర్టెన్లు, ఇతర ఫర్నీచర్‌కు సైతం మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. అలాగే ఇంట్లో పొగ నిండిపోవడంతో ఊపిరాడక కుప్పకూలింది. ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించి స్థానికులు వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కాగా, వారు వచ్చేప్పటికే విజయలక్ష్మీ మృతిచెందినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సూర్యాపేటలో పోలీసుల భారీ బైక్ ర్యాలీ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 18 : ప్రజలు, వాహనదారులు రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం భాగస్వామ్యం కావాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె. నరసింహ పిలుపునిచ్చారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం సూర్యాపేట పట్టణ కేంద్రంలో పోలీసు సిబ్బంది హెల్మెట్లు ధరించి చేపట్టిన భారీ బైక్ ర్యాలీని ప్రారంభించి ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ బైక్ ర్యాలీ కోసం పోలీసు సిబ్బందికి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత లోగో కలిగిన హెల్మెట్స్ పంపిణీ చేశారు.

## బాల్య వివాహాలు సామాజిక రుగ్మత

- అక్షయ తృతీయ వేళ అప్రమత్తంగా ఉండాలి
- స్కోప్ స్వచ్ఛంద సంస్థ అవగాహన సదస్సు
- 200 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ




**తొలివెలుగు, చౌటుప్పల్:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వీటిని నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్కోప్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సోమనర్సయ్య పేర్కొన్నారు. శనివారం ఆరెగూడెం గ్రామంలో అక్షయ తృతీయను పురస్కరించుకుని బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండని బాలికలకు, 21 ఏళ్లు నిండని బాలురకు వివాహం చేయడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా వారి భవిష్యత్తు అంధకారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అక్షయ తృతీయ వంటి పర్వదినాల్లో బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉన్నందున గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే వెంటనే 1098 లేదా 100/112 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం మండల కోఆర్డినేటర్ బి. నరసింహరాజు, సర్పంచ్ ఏ. ధనలక్ష్మి వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో 200 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెన్సిళ్లు, ఎరైజర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎన్. సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి రాజేందర్ రెడ్డి, హైస్కూల్ హెడ్‌మాస్టర్ కే. వేణుగోపాల్, ప్రైమరీ హెడ్‌మాస్టర్ సిహెచ్ కవిత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.




# హైకోర్టు ఆదేశాలు ధిక్కరణ.. ఆర్డీవోకు జైలుశిక్ష




మణికొండ/ శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 18 : న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించిన కేసులో రాజేంద్రనగర్ ఆర్డీవో కె.వెంకట్‌రెడ్డికి నెలరోజుల సాధారణ జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ.. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. శంషాబాద్ మండ లం పెద్దషాపూర్ గ్రామంలోని 74 ఎకరాల భూమికి సంబంధించి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదంపై న్యాయస్థానం అందించిన ఆదేశాలను ఆర్డీవో బేఖతారు చేశారని విచారణలో వెల్లడైంది. అంతేకాకుండా ఆర్డీవో వెంకట్‌రెడ్డి ప్రవర్తనను తీవ్రం గా పరిగణించి వివాదంపై నిష్పాక్షికంగా, న్యాయంగా పరిష్కారం జరిగేలా చూడటానికి ఈ విషయాన్ని అతని నుంచి ఉపసంహరించుకుని సమర్థుడైన మరో ఆర్డీవోకు అప్పగించాలని న్యాయమూర్తి.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని ఆదేశించారు. పిటిషనర్ నవాబ్‌మోండ్ యూసుపుద్దీన్ ఖాన్, ఆ ఆస్తి ప్రైవేటు పట్టా భూమి అని చెప్పినప్పటికీ ఈ వివాదం 1977 నాటిదని, అప్పుడు, భూ సంస్కరణల ట్రిబ్యూనల్ దానిని సీలింగ్ భూమిగా వర్గీకరించింది. సివిల్ కోర్టుల్లో విచారణ జరిగిన తర్వాత , తాజా నిర్ణయం కోసం ఈ విషయాన్ని ట్రిబ్యునల్‌కు తిరిగి పంపించారు. భూ సంస్కరణల ట్రిబ్యునల్ అధికారి హోదాలో వ్యవహరిస్తున్న ఆర్డీవో 2024లో ఈ విషయాన్ని తీర్పు నిమిత్తం రిజర్వు చేసిన తర్వాత దానిని నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించడంలో విఫలమవ్వడంతో ప్ర స్తుతం న్యాయ వివాదం మొదలైంది. ఈ జాప్యాన్ని సవాలు చేస్తూ బాధితులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇం దుకు స్పందించిన న్యాయస్థానం.. ఫిబ్రవరి 2025లో ఆరువారాల్లోగా తగిన ఉత్తర్వులు జారీచేయాలని ఆర్డీవో వెంకట్‌రెడ్డిని ఆదేశించింది. అయినా ఆ అధికారి ఆదేశాలను పాటించకపోవడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు స్పందించిన న్యా యస్థానం.. కోర్టు ధిక్కరణ నోటీసులు అంది న తర్వాత కూడా 2026 ఫిబ్రవరిలో హాజరు కావాలని సమన్లు జారీచేసే వరకు ఆర్డీవో స్పందించలేదు. కోర్టు సమన్లు జారీ చేసిన తర్వాత అతను ఈ వివాదంపై ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఉత్తర్వులో తీవ్రమైన లోపాలు ఉన్నాయని హైకోర్టు గుర్తించింది. ఆర్డీవో ఉత్తర్వులో సరైన కారణాలు లేవని, అందులోని నిర్ధారణలు పొంతన లేకుండా ఉన్నాయని, అవి ప్రస్తుతం ఉన్న రికార్డులకు విరుద్ధంగా ఉన్నాయని న్యాయమూర్తి తేల్చారు. విషయాన్ని పునః పరిశీలన కోసం అధికార సంస్థకు పంపినప్పుడు, ఆర్డీవో కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారించే ముందు వాస్తవాలను పరిగణలోకి తీసుకుని విచారించాలని కోర్టు పేర్కొంది. కోర్టు ధిక్కరణలో భాగంగా హైకోర్టు నెలరోజుల సాధారణ జైలు శిక్షతో రూ.2వేల జరిమానా అనుభవించేందుకు హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్-1) ఎదుట లొంగిపోవాలని ఆర్డీవోను ఆదేశించింది. అయితే రెండు వారాల్లో సరైన సంజాయిషీతో పాటు అప్పీల్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

# నిమ్స్‌లో ఏఐ రిసెప్షన్



సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): సాధారణంగా నిమ్స్, ఉస్మానియా, గాంధీ వంటి ఏదైన పెద్ద దవాఖానకు వెళ్లినప్పుడు అక్కడ ఏ విభాగం ఎక్కడ ఉందో చాలా మందికి తెలియదు. అక్కడ ఉన్న సిబ్బంది సైతం కొన్ని సార్లు సమాచారం ఇవ్వడంలో కొంత చిరాకు పడుతుండడం, తమకు తెలియదని దాటవేయడం, లేదా అటు వెళ్లమని మొక్కుబడిగా చెప్పడం వంటివి కూడా మనం చూస్తూ ఉంటాం. దీంతో చాలా మంది రోగులు, వారి సహాయకులు దవాఖానలో గంటల తరబడి అటూ ఇటూ చెప్పులరిగేలా తిరుగుతుంటారు. దీనివల్ల చాలా సమయం వృథా కావడమే కాకుండా సరైన సమాచారం అందక చాలా ఇబ్బందులకు గురవుతుంటారు.తెలంగాణ సమాచారం

ఇలాంటి సమస్యలన్నింటికీ చెక్ పెట్టి, రోగులకు సరైన సమాచారం అందించాలనే ఉద్దేశంతో నిమ్స్ అధికారులు ఒక విన్నూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదే ఏఐ రిసెప్షన్. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ముందంజలో ఉన్న నిమ్స్ అధికారులు వైద్య సేవల్లోనే కాకుండా పరిపాలనా విభాగంలో సైతం కృత్రిమ మేధ(ఏఐ)ని వినియోగానికి పెద్దపీట వేస్తున్నారు. ఇందులో భాగంగా నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(నిమ్స్)లో మూడు రోజుల కిందట ఏఐ రిసెప్షన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం స్పెషాలిటీ బ్లాక్‌లో ఏఐ రిసెప్షన్ ట్రయల్ రన్‌ను ప్రారంభించాం. ఇది విజయవంతమైతే అన్ని బ్లాక్‌లలో ఏర్పాటు చేస్తాం. దీని వల్ల రోగులకు సరైన సమాచారం అందించడంతో పాటు అటూ, ఇటూ తిరగాల్సిన పని ఉండదు. ముఖ్యంగా నిరక్ష్యరాస్యులు ఎవరిని అడగకుండా తమకు కావల్సిన సమాచారాన్ని రోబో ముందు నిల్చుని అడిగితే చాలా రోబో చెప్పేస్తుంది. త్వరలోనే ఓపీ, వైద్య పరీక్షలు వంటి వాటికి సంబంధించిన పేమెంట్స్‌ను కూడా క్యూర్ కోడ్‌ల ద్వారా కియోస్క్, రోబో యంత్రాల వద్దనే ఏర్పాటు చేస్తాం. దీనికి సంబంధించి ఇప్పటికే ఎస్‌బిఐ అధికారులతో చర్చలు జరుగుతున్నాయి. మెడికల్ రిపోర్ట్స్ కూడా ఈ యంత్రాల ద్వారానే తీసుకునే విధంగా ఏర్పాట్లు చేయనున్నాం. ఇప్పటికే నిమ్స్ యాప్‌ను, క్యూర్ కోడ్, ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఏఐ రిసెప్షన్, ఏఐ చెల్లింపులు, రిపోర్ట్స్ కలెక్షన్ సేవలు కూడా అందుబాటులోకి వస్తే రోగులకు క్యూలైన్‌లలో నిరీక్షించాల్సిన అవసరం ఉండదు. దీని వల్ల సమయం కూడా వృథా కాదు. అలాగే వైద్య పరీక్షల్లో జాప్యాన్ని తొలగించేందుకు ఆటోమేటిక్ ల్యాబ్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఉదయం 10 గంటలకు శాంపిల్స్ ఇస్తే మధ్యాహ్నం 2 వరకు దాదాపు అన్ని రకాల నివేదికలు వచ్చేస్తాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకే ఒకే సారి 5వేల మెడికల్ రిపోర్ట్స్‌ను ఇవ్వగలుగుతున్నాం. బయోకెమిస్ట్రీ, పాథలాజి, మైక్రోబయాలజి విభాగాలకు సంబంధించిన అన్ని రకాల రక్త పరీక్షలను ఈ ఆటోమేటిక్ ల్యాబ్‌లలో నిర్వహిస్తుండడం వల్ల నివేదికలు వెంట వెంటనే ఇవ్వగలుగుతున్నాం.

నిమ్స్ దవాఖానలో ప్రతి రోజు సుమారు 3500 నుంచి 4200 మంది ఓపీ సేవలు పొందుతుంటారు. చాలా మందికి ఏ విభాగం ఎక్కడ ఉందో తెలియదు. సరైన సమాచారం లేక రోగులు అటూ ఇటూ తిరిగి సమయాన్ని వృథా చేసుకుంటారు. అంతే కాకుండా సరైన అవగాహన లేక సంబంధం లేని విభాగంలో ఓపీ రిజిస్ట్రేషన్ కోసం క్యూలో నిరీక్షించి, తీరా సమస్య చెప్పగానే అక్కడి సిబ్బంది 'ఈ సమస్యకు ఓపీ ఇక్కడ కాదు ఆ పక్క బ్లాక్‌కు వెళ్లండి' అని చెప్పడంతో రోగులు మళ్లీ పక్క బ్లాక్‌కు పరుగు తీస్తుంటారు. ఈ క్రమంలో రోగులు ఎక్కవ సమయం క్యూలైన్‌లలో నిరీక్షించకుండా ఉండేందుకే ఏఐ రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభించినట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పా తెలిపారు. ఏఐ రిసెప్షన్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న రోబో ముందు నిల్చుని 'నాకు కడుపు నొప్పి సమస్య ఉంది ఏ డాక్టర్‌ని కలవాలి?' అని అడిగితే చాలు. గ్యాస్ట్రో విభాగం వైద్యుడిని కలవండి అని సూచిస్తుంది. అంతే కాదు అక్కడ వైద్యులు ఏయే వైద్యులు అందుబాటులో ఉన్నారో కూడా సమాచారం ఇస్తుంది. రక్త పరీక్షలు ఎక్కడ చేస్తారు, మెడికల్ రిపోర్ట్స్ ఎక్కడ ఇస్తారు తదితర అన్ని రకాల సమాచారాన్ని ఈ ఏఐ రోబో అందిస్తుంది.

# ప్రపంచానికి స్ఫూర్తి భూదానోద్యమం : గుత్తా సుఖేందర్ రెడ్డి



భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 : భూదానోద్యమం ప్రపంచానికే స్ఫూర్తి అని, ఎంతోమంది పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శనివారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని చౌటుప్పల్ చౌరస్తాలో వెదిరే రామచంద్రారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రథమ భూదాత వెదిరే రామచంద్రారెడ్డి కాశీస్య విగ్రహాన్ని, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. స్థానిక టూరిజం పార్క్ లో ఆచార్య వినోబా భావె, వెదిరే రామచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. 75వ వజ్రోత్సవాల సందర్భంగా వినోబా మందిరాన్ని సందర్శించి పాదయాత్ర బృందానికి, భూదాన్ భూమి గ్రహీతలకు, నాయకులకు శాలువాతో ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. భూదాన దాతృత్వం దేశానికి మార్గదర్శకశీగా నిలచిందన్నారు. భూదానోద్యమం భూసంస్కరణలకు దేశంలో ఆర్థిక అసమానతలు తొలగడానికి దోహదపడిందన్నారు. 100 ఎకరాల భూదానంతో మొదలైన ఉద్యమం 44 లక్షల ఎకరాల భూమిని దానంగా సేకరించి, 40 లక్షల మంది పేదలకు భూమిని పంచి పెట్టారన్నారు. ఈ భూదానోద్యమంతో పోచంపల్లికి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్టలు లభించాయని తెలిపారు.దపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. వేదిరే రామచంద్రారెడ్డి 1000 ఎకరాల భూమిని పేదలకు దానం చేసిన కారణ జన్ముడన్నారు. భూమిని దానశీ చేయకుంటే భూదానోద్యమం ఆలోచన వచ్చేది కాదని అన్నారు. రామచంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయమని, భూదానోద్యమ స్ఫూర్తితో యువత సామాజిక స్పృహ పెంపొందించాలన్నారు. భూదానోద్యమ స్ఫూర్తితోనే ఇందిరాగాంధీ సీలింగ్ యాక్ట్ ను తీసుకొచ్చి బడుగు, బలహీన వర్గాలకు భూములను పంచి అంకురార్పణ చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని విచ్ఛినం చేయాలని దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే విధంగా డీలిమిటేషన్ బిల్లులో మహిళా బిల్లును జోడించి పెట్టడంతో పార్లమెంటులో బిల్లు వీగిపోయిందన్నారు. ఇది ప్రధాని నరేంద్ర మోదీకి చెంప పెట్టు లాంటిదన్నారు. ప్రధాని ఒంటెద్దు పోకడలు మాని ప్రతిపక్ష అభిప్రాయాలతో బిల్లును తీసుకురావాలని సూచించారు.



## హైదరాబాద్ జిల్లా 'ట్రస్మా' ప్రధాన కార్యదర్శిగా మంచాల రఘు

- రెండేళ్ల పాటు పదవిలో కొనసాగింపు
- నియామక పత్రం అందజేసిన ఎన్నికల అధికారి

**తొలివెలుగు, రాజపేట:** రాజపేట మండల కేంద్రానికి చెందిన మంచాల రఘు హైదరాబాద్ జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ ఆబిడ్స్‌లోని సుజాత ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికల అధికారి ఎస్.శ్రీనివాస్ రెడ్డి, ట్రస్మా అధ్యక్షుడు ఎస్.మధుసూదన్ సమక్షంలో రఘును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రఘుకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ పదవిలో ఆయన ఏప్రిల్ 16, 2028 వరకు (రెండేళ్ల పాటు) కొనసాగుతారని ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా మంచాల రఘు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేస్తానని, సంఘం బలోపేతానికి తన వంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కల్లో పొరపాట్లకు తావివ్వొద్దు: తహసీల్దార్ ప్రదీప్

- రాజాపేటలో గణన సిబ్బందికి శిక్షణ ప్రారంభం
- తొలిదశలో ఇండ్ల జాబితా నమోదు



**తొలివెలుగు, రాజాపేట:** జనాభా లెక్కల సేకరణలో అత్యంత కీలకమైన ఇండ్ల గణన ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాజాపేట తహసీల్దార్ వి. ప్రదీప్ సూచించారు. జనాభా గణన-2027లో భాగంగా మొదటి దశ అయిన ఇండ్ల జాబితా తయారీ కోసం ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శనివారం నుంచి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మండల చార్జ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న తహసీల్దార్ ఈ శిబిరాన్ని ప్రారంభించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రగతికి ప్రాతిపదిక అయిన జనాభా లెక్కల సేకరణలో క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి, నిర్దేశించిన ఫారాల్లో వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) చందా రమేష్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ నర్సింహులు, ఏఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, రాజాపేట ప్రధానోపాధ్యాయుడు రాజు పాల్గొన్నారు. ఫీల్డ్ ట్రైనర్లు సత్తి రెడ్డి, నరేందర్ రెడ్డి ఉపాధ్యాయులకు గణన విధానంపై అవగాహన కల్పించారు.

## మురిసిన బుజ్జాయిలు.. మురిపెంగా గ్రాడ్యుయేషన్!

- జాల సెయింట్ జెకారియస్ పాఠశాలలో పట్టాల ప్రదానం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

**తొలివెలుగు, రాజాపేట:** విద్యార్థుల విద్యా ప్రస్థానంలో తొలి అడుగును గుర్తిస్తూ రాజాపేట మండలం జాల గ్రామంలోని సెయింట్ జెకారియస్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ మన్నె వినయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూకేజీ, ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ.. విద్యార్థులలో చిన్నతనం నుంచే ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సెయింట్ జెకారియస్ కౌంట్ సంస్థ అధినేత బిషప్ జాన్ గొల్లపల్లి, డైరెక్టర్ డెక్టర్ తిమోతి జాన్ గొల్లపల్లి పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## రామన్నపేటలో పారిశుద్ధ్యం పడకేసింది: సీపీఎం ధ్వజం

- అసంపూర్తి మురికి కాలువలతో ప్రజల అవస్థలు
- మున్సిపాలిటీ తీరుపై 'పోరుబాట'లో నిరసన
- సమస్యలు పరిష్కరించకుంటే ఎంపీడీవో కార్యాలయం ముట్టడి



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీలో అభివృద్ధి మాట దేవుడెరుగు.. కనీసం పారిశుద్ధ్య నిర్వహణ కూడా పడకేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య విమర్శించారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 'పోరుబాట'లో భాగంగా శనివారం నాయకులు పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి ప్రజా సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. వారానికి ఒకసారి బ్లీచింగ్ చల్లే నాథుడే కరువయ్యారని మండిపడ్డారు. అసంపూర్తిగా నిర్మించిన మురికి కాలువలతో మురుగునీరు నిలిచి దోమలు, పందులకు నిలయంగా మారిందని, తద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల క్రితం వేసిన సీసీ రోడ్లపై మోరీలు ధ్వంసమై ప్రమాదకరంగా మారినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. హరిజనవాడ నుంచి అలీసాబ్ గుట్టకు వెళ్లే ప్రధాన నీటి పైపులైన్ లీకేజీతో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోందని, అందులో పందులు పడి చనిపోతున్నాయని పేర్కొన్నారు. చేతిపంపులను మరమ్మతుల పేరిట ఊడబీకి వదిలేయడంతో విడిభాగాలు చోరీకి గురయ్యాయని, ఎండాకాలం దృష్ట్యా వాటిని బాగు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శివర్గ సభ్యులు కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, సీనియర్ నాయకులు ఆముద ఆంజనేయులు, భావాండ్లపల్లి సత్యం, పల్లె సత్యం, రాసాల రమేష్, గొరిగే మల్లేశం, బండారు రాకేష్, మునికుంట్ల రాణి, సిద్ధమ్మ, పర్స అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ.. మహిళా వ్యతిరేకి!

- మహిళా రిజర్వేషన్ బిల్లుపై ద్వంద్వ వైఖరి తగదు
- చౌటుప్పల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసన
- దిష్టిబొమ్మ దహనయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు
- బీజేపీ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్





**తొలివెలుగు, చౌటుప్పల్:** చట్టసభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తీరు విచారకరమని బీజేపీ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మహిళా వ్యతిరేక విధానాలనే అవలంబిస్తోందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ తీరును నిరసిస్తూ శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన అడ్డంకిగా మారిందని ఆరోపించారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడంలో ఆ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, వారి ద్వంద్వ వైఖరి ఎప్పటికప్పుడు బయటపడుతూనే ఉందన్నారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. అనంతరం నిరసనకారులు కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, రమణగోని శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఆల చిరంజీవి, బుడ్డ సురేష్, యాస అశోక్ రెడ్డి, ఉడుగు వెంకటేశం గౌడ్, పాలకుర్ల జంగయ్య గౌడ్, ఉబ్బు బుచ్చయ్య, గోష్క నీరజ, బర్మా నాగరాణి, కడెం భాగ్యమ్మ, బోడిగే పద్మ, కట్ట కృష్ణ, దిండు భాస్కర్, లగోని పాండు, కొయ్యాడ స్వామి గౌడ్, ఓరకంటి భాను, అమృత, దశరథ, మధు, లింగస్వామి, బతరాజు వెంకటేష్, వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పొట్టగొడుతున్న కేంద్రం

- అమెరికాతో చీకటి ఒప్పందాలు దేశ వ్యవసాయానికి ముప్పు
- ధర్నా చౌక్‌లో 'కిసాన్ న్యాయ్ మహా ధర్నా'
- కేంద్ర ప్రభుత్వ తీరుపై ఉదయ్ భాను ఛిబ్, మంత్రి సీతక్క ధ్వజం
- నేతలను కలిసిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌనిక గౌడ్




**తొలివెలుగు, హైదరాబాద్, చౌటుప్పల్:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో దేశ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను ఛిబ్, రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'కిసాన్ న్యాయ్ మహా ధర్నా'ను భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఉదయ్ భాను ఛిబ్, మంత్రి సీతక్కలను రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పెద్దగోని మౌనిక గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం ధర్నాను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ.. ఎన్డీఏ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశంలో రైతులు, కార్మికులు, యువకులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి వెన్నెముక అయిన రైతన్నల ప్రయోజనాలను కేంద్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ముఖ్యంగా అమెరికా ప్రభుత్వంతో మోదీ సర్కారు కుదుర్చుకున్న చీకటి ఒప్పందాల వల్లే దేశంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు ఆరోపించారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను ఎత్తివేయడం ద్వారా, మన దేశీయ మార్కెట్లను విదేశీ వ్యవసాయ ఉత్పత్తులతో నింపేసి, స్థానిక రైతుల పొట్టగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ నిర్ణయాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైతుల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## మా త్యాగాలే లేకుంటే మీరు ఎక్కడుండేవారు?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మలిదశ ఉద్యమకారుల జేఏసీ
- జూన్ 2న సీఎం ప్రసంగాన్ని అడ్డుకుంటాం
- స్పష్టమైన హామీ ఇవ్వాలని సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** 'ప్రాణాలకు తెగించి పోరాడిన మలిదశ ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన రాష్ట్రంలో, అదే ఉద్యమకారులను విస్మరించడం దారుణం' అని టీయూ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపై సమరశంఖం పూరించారు. జూన్ 2వ తేదీని ప్రభుత్వం డెడ్‌లైన్‌గా గుర్తించాలని, ఆ రోజులోగా తమ సమస్యలపై జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రకటన రాని పక్షంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకుంటామని ఘాటుగా హెచ్చరించారు. ఒకవైపు ఉద్యమకారులు ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో చనిపోతుంటే పాలకులు వేడుకలు చేసుకోవడం వారిని అవమానించడమేనన్నారు. "ఇంకా ఎంతమంది చనిపోవాలి? మా పోరాటాలే లేకపోతే ఇవ్వాళ మీరు ఈ కుర్చీల్లో ఉండేవారా?" అని నిలదీశారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## భాజపా కార్యశాలను జయప్రదం చేయాలి: నకిరేకంటి మొగులయ్య

- మహిళా బిల్లుపై కాంగ్రెస్ తీరు విచారకరం
- రామన్నపేటలో బి ఎల్ ఏ-2 మండల స్థాయి సమావేశం

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండల కేంద్రంలో శనివారం బీజేపీ 'బి ఎల్ ఏ-2' (బూత్ లెవల్ అసిస్టెంట్) మండల కార్యశాల నిర్వహించారు. మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నకిరేకల్ అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ నకిరేకంటి మొగులయ్య, మండల ఇన్‌ఛార్జ్ కొరివి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 25న కట్టంగూరులో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వారు మహిళా రిజర్వేషన్ బిల్లుపై స్పందిస్తూ.. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం బిల్లు ప్రవేశపెడితే, కాంగ్రెస్ పార్టీ దాన్ని వ్యతిరేకించడం ఆ పార్టీ మహిళా వ్యతిరేక విధానానికి నిదర్శనమని విమర్శించారు. మహిళలను చట్టసభలకు పంపడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, వారి తీరును మహిళా లోకమంతా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వనం అంజయ్య, సీనియర్ నాయకులు డోగిపర్తి సుభాష్, కట్ట యాదయ్య, యువ మోర్చా జిల్లా కార్యదర్శి అక్కేనపల్లి సైదులు, మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్, మండల ఉపాధ్యక్షులు బట్టే రమేష్, గజ్జల రాము, కార్యదర్శి బందెల సంజీవ, కోశాధికారి గురుకు జ్యోతి, బీజేపీ నాయకులు శ్యామ్ సుందర్, రాపోలు రమేష్, బైరగోని రమేష్, శానగుండ మల్లికార్జున చారి, రాపర్తి గణేష్, మేడి పరశురాం, దావునూరి అజయ్, సుర్వి మల్లేశం, ఆవుల సాయికుమార్, సుర్వి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చుంకీ పాండేకు భార్యగా నటించడంపై మృణాల్ అసంతృప్తి

ఈ మధ్యకాలంలో మరో హీరోయిన్‌పై పుట్టుకురానన్ని గాసిప్స్ మృణాల్ ఠాకూర్‌పై వచ్చాయి. డేటింగ్ వార్తల నుండి ఆ మూవీలో నుండి క్విటయ్యిందట, ఈ మూవీలో ఫిక్సైందట రూమర్స్ వచ్చాయి. ఇటు కెరీర్ కూడా సక్సెస్ ట్రాక్ తప్పడంతో ఈ వార్తలతోనే లైమ్ లైట్లో నిలిచింది సీతామహాలక్ష్మీ. డేటింగ్.. నథింగ్ అని చెబుతున్నా వీటికి ఎండ్ కార్డ్ పడటం లేదు. తాజాగా మరోసారి క్లారిటీ ఇవ్వాల్సి వచ్చింది డెకాయిట్ బ్యూటీ. సినిమా రిలీజెస్ టైంలో డేటింగ్ వార్తలు రావడం పట్ల కాస్త అసంతృప్తిని వ్యక్తం చేసింది మృణాల్. ఇలాంటి వార్తలతో కన్నా డ తన వర్క్ ద్వారానే ఐడెంటిటీని పొందాలనుకుంటున్నానంటోంది భామ. ఇక తనకు ప్రేమించేంత టైం లేదట. తన కాలికి గాయమైతే.. ట్రీట్ మెంట్ చేయించుకోవడానికే సమయం దొరకడం లేదని.. ఇక లవ్ చేసేంత తీరిక తనకు ఎక్కడదని అంటోంది సీత. ఇక గత ఏడాది అజయ్ దేవగన్ మూవీ సన్నాఫ్ సర్దార్2లో నటిచండంపై విచారం వ్యక్తం చేసింది సీతామహాలక్ష్మీ. స్క్రిప్ట్ నేరేషన్ ఒకటైందని, తెరపై మరొకటి చిత్రీకరించారని అంటోంది. సీనియర్ నటుడు చుంకీపాండేకు భార్యగా నటించడం తాను ఎక్స్ పర్ట్ చేయలేదని, అక్కడ తాను ఫెయిలైయ్యానంటూ చెప్పుకొచ్చింది అమ్మడు. మూవీ పట్ల రిగ్రెట్ ఫీలవ్వడం లేదని.. ఫెయిల్యూర్స్ నుండి పాఠాలు నేర్చుకుంటున్నట్లు చెబుతుంది. అయితే నెటిజన్స్ మాత్రం మృణాల్‌ను టార్గెట్ చేస్తున్నారు. చుంకీ పాండేను టార్గెట్ చేయడంతో అజయ్ దేవగన్ ఏమన్నా యంగ్ హీరోనా అంటూ కౌంటరిస్తున్నారు. చెప్పాలంటే.. దేవగన్ కన్నా.. చుంకీ బెటర్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.





## ఘట్టమనేని మూడో తరంలో స్టార్ అయ్యేదెవరు?

తెలుగు చిత్ర పరిశ్రమలో 'సూపర్ స్టార్' అనే పదానికి నిలువెత్తు రూపం కృష్ణ. ఆయన వారసత్వాన్ని సెకండ్ జనరేషన్‌లో మహేశ్ బాబు అద్భుతంగా ముందుకు తీసుకెళ్లారు. కానీ రమేశ్ బాబు 15 సినిమాల్లో నటించినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. మంజుల కూడా నటిగా కంటే నిర్మాతగానే ఎక్కువ గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు అందరి దృష్టి 'ఘట్టమనేని మూడో తరం' పైనే ఉంది. ఈ తరంలో అందరూ నటీనటులుగానే వెండితెరపై మెరవడానికి సిద్ధమవుతున్నారు. రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఇప్పటికే తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. గతంలో మహేశ్ బాబు సినిమా 'నిజం'లో చిన్నప్పటి మహేశ్‌గా నటించిన జయకృష్ణ ఇప్పుడు 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'ఆర్ఎక్స్ 100' ఫేం అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ఇటీవలే విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. ఇందులో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కూతురు రషా థడానీ హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఘట్టమనేని ఆడపడుచులు కూడా నటనపై ఆసక్తి చూపిస్తున్నారు. రమేశ్ బాబు కూతురు భారతి ఇప్పటికే సోషల్ మీడియాలో తన డాన్స్‌తో అందరినీ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా 'కుర్చీ మడతపెట్టి' సాంగ్‌కు ఆమె వేసిన స్టెప్పులు వైరల్ అయ్యాయి, త్వరలోనే ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు మంజుల కూతురు జాన్వీ స్వరూప్ ఫోటోలు కూడా నెట్టింట హల్చల్ చేస్తున్నాయి. ఆమె బర్త్‌డే సందర్భంగా షేర్ చేసిన ఫోటోలు చూస్తుంటే జాన్వీ కూడా వెండితెర అరంగేట్రం చేసే సూచనలు కనిపిస్తున్నాయి. సితార  గౌతమ్ లపై భారీ అంచనాలు సూపర్ స్టార్ మహేశ్ బాబు పిల్లలు సితార, గౌతమ్ లపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. సితార ఇప్పటికే 'సర్కారువారి పాట' ప్రమోషనల్ సాంగ్‌లో మెరిసి, సోషల్ మీడియా సెన్సేషన్‌గా మారింది. ఆమె త్వరలోనే వెండితెరపైకి వస్తుందని అందరూ భావిస్తున్నారు. ఇక గౌతమ్ కృష్ణ, 'నేనొక్కడినే'లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా మెప్పించి, ప్రస్తుతం అమెరికాలో యాక్టింగ్ కోర్స్ పూర్తి చేస్తున్నాడు. త్వరలోనే అతడు పూర్తిస్థాయి హీరోగా ఎంట్రీ ఇచ్చి తండ్రికి తగ్గ వారసుడిగా నిరూపించుకోవాలని ఘట్టమనేని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## తొందరపడే ప్రసక్తే లేదు!

సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలకు షూటింగ్ దశలోనే థియేట్రికల్, నాన్-థియేట్రికల్ డీల్స్ క్లోజ్ అయిపోతుంటాయి కానీ 'స్పిరిట్' టీమ్ మాత్రం ఇందుకు భిన్నంగా వెళ్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు ఎలాంటి ఎక్స్టర్నల్ ఫైనాన్షియల్ బ్యాకింగ్ అవసరం లేదని సమాచారం. దీంతో నిర్మాతలు ౧-ూవతీఅవంతో పాటు ప్రభాస్, సందీప్ వంగా ముగ్గురూ కలిసి ఒక కీలక నిర్ణయానికి వచ్చారు. డిజిటల్, శాటిలైట్ సహా ఇతర నాన్-థియేట్రికల్ హక్కులను ఇప్పుడే అమ్మకూడదని వారు గట్టిగా ఫిక్స్ అయ్యారు. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి దిగ్గజ ఓటిటి ప్లాట్‌ఫారమ్‌లు ఇప్పటికే భారీ ఆఫర్లతో మేకర్స్‌ని సంప్రదించినట్లు తెలుస్తోంది. సినిమా క్రేజ్ దృష్ట్యా రికార్డు స్థాయి ధరలను ఆఫర్ చేసినప్పటికీ, టీమ్ మాత్రం ససేమిరా అంటోంది. సందీప్ రెడ్డి వంగా గత చిత్రం 'యానిమల్' సృష్టించిన సంచలనం అందరికీ తెలిసిందే. ఇప్పుడు ప్రభాస్‌తో కలిసి ఆయన చేస్తున్న ఈ 'పోలీస్ డ్రామా'పై మార్కెట్‌లో విపరీతమైన హైప్ ఉంది. ఈ ఏడాది చివరలో సినిమా ఒక కొలిక్కి వచ్చిన తర్వాతే, మార్కెట్ వాల్యూ మరింత పెరుగుతుందని మేకర్స్ భావిస్తున్నారు. అప్పుడే డీల్స్ క్లోజ్ చేస్తే ఊహించని రేంజ్ బిజినెస్ జరుగుతుందని వారి ప్లాన్. ప్రస్తుతానికి 'స్పిరిట్' మేకర్స్ దృష్టంతా అవుట్‌పుట్ మీద మాత్రమే ఉంది. ఈ ఏడాది ఆఖరి వరకు ఎలాంటి బిజినెస్ డీల్స్ ఉండకపోవచ్చని స్పష్టమవుతోంది. అంటే, ప్రభాస్ ఫ్యాన్స్ ఈ భారీ ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కోసం మరికొంత కాలం వేచి చూడాల్సిందే. ఒకవేళ డీల్స్ గనుక ఓపెన్ అయితే మాత్రం, ఇండియన్ సినిమా హిస్టరీలోనే అది ఒక సరికొత్త రికార్డు కావడం ఖాయం.




## మళ్లీ వస్తున్న 'ఓ అందాల రాక్షసి'!

మల్టీ టాలెంటెడ్ డైరెక్టర్ షెరాజ్ మెహదీ దర్శకత్వంలో రూపొందిన సందేశాత్మక చిత్రం 'ఓ అందాల రాక్షసి'. గతంలో విడుదలైనప్పుడు పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమాను.. ప్రేక్షకుల కోరిక మేరకు ఈ నెల ఏప్రిల్ 24న గ్రాండ్‌గా రీ-రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో చిత్ర యూనిట్ ప్రత్యేక షోను నిర్వహించి.. మీడియా సమావేశంలో సినిమా విశేషాలను పంచుకున్నారు. ఓ అందాల రాక్షసి సినిమా కేవలం కమర్షియల్ హంగులతో కాకుండా.. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల చుట్టూ తిరుగుతుంది. ఇది గ్లామర్ కంటే కథా బలానికి ప్రాముఖ్యతనిచ్చే వుమెన్ ఓరియెంటెడ్ చిత్రం. అమాయక మహిళలు మోసగాళ్ల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ సబ్జెక్టును ఎంచుకున్నట్లు దర్శకుడు తెలిపారు. అమ్మాయిలపై వేధింపులు, అత్యాచారాలకు పాల్పడే దుర్మార్గులకు ఎలాంటి శిక్షలు ఉండాలో ఈ సినిమాలో చూపించారు.

